క్లుప్తంగా

తిమ్మరాజుపేటలో ఉచిత పశువైద్య శిబిరం


ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న నోడల్ అధికారి డాక్టర్ భానుబాబు

మునగపాక : తిమ్మరాజుపేటలో శుక్రవారం రిలయన్స్ ఫౌండేషన్, అలంబిక్ ఫార్మస్యూటికల్ సంయుక్త నిర్వహణలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నోడల్ అధికారి డాక్టర్ భానుబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో పశు పోషణ పట్ల రైతులు జాగ్రత్తలు వహించాలన్నారు. పశువులను ఎండలో ఉంచకుండా నీడ తగిలే ప్రాంతాల్లో ఉంచడం ద్వారా ఎటువంటి ఇబ్బందులు రావన్నారు. 64 పశువులను తనిఖీ చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, ఎంపీటీసీ అప్పలనరసమ్మ, వైద్యులు పద్మజ, కోదండరామ్, పాలసంఘ అధ్యక్షుడు జగన్నాథరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి


జగనన్న కాలనీ లబ్ధిదారులతో సమావేశమైన మండల ప్రత్యేకాధికారి మంజులావాణి

మునగపాక : జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి మంజులావాణి కోరారు. హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా ఆమె శుక్రవారం మునగపాక జగనన్న లే–అవుట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఎంపీడీవో పి.రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, పంచాయతీ ఈవో అజయ్‌బాబు, సచివాలయ ఉద్యోగులు ఆమె వెంట పాల్గొన్నారు.

నక్కపల్లి పాఠశాలకు మైక్ సెట్ వితరణ


మైక్‌సెట్‌ను ఉపాధ్యాయులకు అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

నక్కపల్లి : నక్కపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1972–73వ సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆ పాఠశాలకు మైక్ సెట్ విరాళంగా అందజేశారు. శుక్రవారం వారంత గోల్డెన్ జూబ్లీ సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా రూ.40వేలు విలువ కలిగిన మైక్ సెట్‌ను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రభాకర్, రాజారావు, నాగేశ్వరరావు దయాకర్, కొత్త తాతాజీ పాల్గొన్నారు.

వీధి దీపాల పునరుద్ధరణ


సింగవరంలో వీధిలైట్లు మార్చుతున్న సిబ్బంది

కశింకోట : మండలంలోని జి.భీమవరం శివారు సింగవరం గ్రామంలో షార్టు సర్క్యూట్ వల్ల కాలిపోయిన వీధి లైట్ల స్థానంలో శుక్రవారం కొత్త లైట్లను ఏర్పాటు చేశారు. వారం కిందట లైట్లు కాలిపోయాయి. దీంతో రాత్రిపూట వీధుల్లో చీకట్లు అలముకుని ప్రజలు ఇబ్బంది పడుడేవారు. సర్పంచ్ హనుమంతు వెంకటలక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు అల్లం శంకరరావులు ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు నివేదించారు. స్పందించిన యంత్రాంగం లైట్లను పునరుద్ధరించింది. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్, ఎంపీటీసీలతోపాటు పంచాయతీ కార్యదర్శి బర్నికాన చిన్నోడు, ఉప సర్పంచ్ కొండ్ర శ్రీనివాస్, వార్డు సభ్యులు కిల్లాడ నగేష్, సత్తిబాబు పనుల్ని పర్యవేక్షించారు.

నులిపురుగును నులిమేద్దాం...


డీ వార్మింగ్ డే గురించి వివరిస్తున్న డాక్టరు ప్రశాంతి


ఉపాధ్యాయులకు నులిపురుగుల నివారణ మాత్రలు అందజేస్తున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారులు


అంగన్‌వాడీ కార్యకర్తలకు అల్బెండజోల్ మాత్రలు అందజేస్తున్న ఎంపీడీవో రామచంద్రమూర్తి

ఎస్.రాయవరం : పిల్లలకు విధిగా అల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో రామచంద్రమూర్తి సూచించారు. సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక, యూపీ పాఠశాలలో విద్యార్థులకు విధిగా ఈ మాత్రలు విద్యాశాఖ సమక్షంలో పంపిణీ చేయాలన్నారు. మాత్రలు అందజేసే ముందు వాటి ప్రాముఖ్యత వివరించి ఇవ్వాలన్నారు. ఈ 14న జాతీయ నులిపురుగుల నిర్మూలన సందర్భంగా ఈ కార్యక్రమం విస్తృతంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి మూర్తి, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, వైద్యాధికారులు శక్తిప్రియ, రామ్ నాయక్‌లు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

మునగపాక : ఈ నెల 14న జరగనున్న నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇమ్యునైజేషన్ జిల్లా అధికారులు మురళి, కిషోర్‌లు సంయుక్తంగా కోరారు. స్థానిక మండల పరిషత్ హాలులో పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల హెచ్‌ఎంలు, ఏఎన్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకోవడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యంగా, చురుగ్గా ఉండవచ్చన్నారు. ఎంపీడీవో రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్ పాల్గొన్నారు.

డీవార్మింగ్‌డే ఏర్పాట్లపై సమీక్ష

నక్కపల్లి : ఈనెల 14న జరిగే డీవార్మింగ్ డే ఏర్పాట్లపై ఎంపీడీవో సీతారామరాజు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మండల స్థాయి అధికారులంతా ఈ సమావేశానికి హాజరయ్యారు. 14న జరిగే కార్యక్రమంలో విద్యార్థులకు ఈ మాత్రలు పంపిణీ చేయడంతో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషించాలన్నారు. 15105 మంది విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. వాంతులు, విరేచనాలు, దగ్గు జ్వరం, రొంప ఉన్నవారికి ఈ మాత్రలు వేయరాదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది కూడా భాగస్వాములు కావాలన్నారు.

కోటవురట్ల : నులిపురుగుల నివారణకు చేపడుతున్న డీ వార్మింగ్ డేను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, వైద్య సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీన డీ వార్మింగ్ డే కార్యక్రమం విజయవంతంగా పూర్తి చేసేందుకు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. మండలంలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులతో ఆల్బెండజాల్ మాత్రను మింగించి నులిపురుగుల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారులు ప్రశాంతి, సంతోష్‌కుమార్ మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు 84 పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో 4286 మంది పిల్లలను గుర్తించినట్టు తెలిపారు. ఎంపీడీవో చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే..


లింగాపురం లే అవుట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

కోటవురట్ల : ప్రతి కుటుంబానికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న కాలనీలను నిర్మిస్తోందని, ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ కోరారు. లింగాపురంలోని హౌసింగ్ లే అవుట్‌లో శుక్రవారం హౌసింగ్ డే నిర్వహించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. ఇంకా ఇంటి నిర్మాణాలు ప్రారంభించని వారు వెంటనే ప్రారంభించాలని ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. లే అవుట్లలో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష చేశారు. లబ్ధిదారులకు అవగాహన కల్పించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ జగదీశ్వరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కరుణ పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ నులిపురుగు మాత్ర వేయాలి


మాట్లాడుతున్న ఏడీఎంహెచ్‌వో శారదాబాయి

అచ్యుతాపురం(అనకాపల్లి): ఈ నెల 14న 1–19 సంవత్సరాల వయస్సు గల వారికి నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్నామని అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి శారదాబాయి తెలిపారు. శుక్రవారం అచ్యుతాపురం మండల పరిషత్ సమావేశ మందిరంలో విద్య, వైద్య ఆరోగ్య శాఖ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు ఏడాదికి ఒకసారి వేయడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చన్నారు. 14వ తేదీ మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత ఈ మాత్ర వేయాలని, ఎటువంటి రియాక్షన్ ఉండదని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు చొరవ చూపి ప్రతి ఒక్క విద్యార్థి ఈ మాత్ర వేసుకొనేలా పర్యవేక్షించాలన్నారు. ఎంఈవో దేవరాయలు, వైద్యులు రజనీ, కళ్యాణి, ఆరోగ్య పర్యవేక్షకులు ఎరుకునాయుడు, సహాయకులు అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పాఠశాలల ఉపాధ్యాయులకు ఆల్బెండజోల్ మాత్రల కిట్‌ను అందజేశారు.

దోమల నివారణకు విస్తృత చర్యలు


ఎస్.రాయవరంలో మురుగు కాలువలో చెత్తను పరిశీలిస్తున్న వైద్యాధికారి శక్తిప్రియ

ఎస్.రాయవరం : గ్రామాల్లో చెత్త, నిల్వ నీటిలో, మురుగునీటిలో పెరుగుతున్న దోమల నివారణకు విధిగా చర్యలు తీసుకోవాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి శక్తి ప్రియ అన్నారు. ఫ్రైడే డ్రై డే లను పురస్కరించుకుని మండల కేంద్రంలో ఉన్న మురుగుకాలువను పరిశీలించారు. యాంటీ లార్వా ఆపరేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నాగేంద్ర కుటుంబానికి న్యాయం చేయాలి

పాయకరావుపేట : మండలంలో గల పీఎల్ పురం గ్రామంలో హత్యకు గురైన దళిత యువకుడు వడ్లమూరి నాగేంద్ర కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు వి.కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో ఎస్సీ, ఎస్టీ మైనార్టీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దళిత బహుజన పార్టీ నాయకులు, దావీద్, అన్నపూర్ణ, సూరిబాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

పాయకరావుపేట : పీఎల్‌పురం గ్రామంలో హత్యకు గురైన దళిత యువకుడు వడ్లమూరి నాగేంద్ర కుటుంబానికి ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆరుగుల మోషే ఆర్థిక సాయం అందించారు. నాగేంద్ర తల్లికి రూ.5 వేలు నగదు, 50 కేజీల బియ్యం అందించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కార్యవర్గ సభ్యులు టి.కుమార్, పి.గోవిందు, జి.రాజు పాల్గొన్నారు.

సుధాకర్‌ను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టండి


కొరుప్రోలులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు


రాజయ్యపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

నక్కపల్లి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల్లో ఎమ్మెల్సీగా పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన రాజయ్యపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థి సుధాకర్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి వ్యక్తిగతంగా కృషి చేస్తారన్నారు. సమస్యలపై అవగాహన కలిగిన వ్యక్తి సుధాకర్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చారని, మాది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వమని నిరూపించారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా పార్టీ మద్దతు ఇచ్చిన అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు. నిరుద్యోగులు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రరావు, నాయకులు శీరం నర్సింహమూర్తి, శేషారత్నం, ఎరిపల్లి నాగేశు, నూకరాజు పాల్గొన్నారు.

పాయకరావుపేట ఈ నెల 13 న జరగబోయే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపర్చిన సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని నాయకులు ప్రచారం సాగిస్తున్నారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఉత్తరాంధ్ర అభివృద్ధికి పట్టభద్రులందరూ ఓటు ద్వారా పూర్తి సహకారం అందించాలని నాయకులు ఓటర్లను కోరుతున్నారు. ఓటర్ల పట్టభద్రులకు బ్యాలట్ నమూనా పత్రాలను అందించి ఓటు ఏవిధంగా వేయాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, మత్స్యకార నాయకులు ఎం.అశోక చక్రవర్తి పాల్గొన్నారు.

ఎస్.రాయవరం : ఉత్తరాంధ్రా పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలిపించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలు క్యాంపు కార్యాలయం వద్ద నాలుగు మండలాల నాయకులతో ఎమ్మెల్యే అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఓటింగ్‌కు ఎక్కువ సమయం లేనందున మండలాల వారీగా ఉన్న బూత్ కమిటీ సభ్యులు అప్రమత్తం కావాలన్నారు. ఓటర్లకు ఓటు వేసే పద్ధతితో పాటు ఓటింగ్ వచ్చినప్పుడు వివరించాల్సిన సమాచారం కూడా ప్రచారంలో చెప్పాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణ రాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, మామిడి చంటి, సీరం నరసింహమూర్తి, జిల్లా మత్స్యకార సంఘ అధ్యక్షుడు మాతా గురునాథరావు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం సాగిస్తున్న నాయకులు

అక్రమంగా తరలిస్తున్న పశువుల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న పశువులు

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం కూడలిలో అక్రమంగా రవాణా చేస్తున్న 40 పశువులను శుక్రవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఒడిశా నుంచి హైదరాబాద్‌కు కంటైనర్‌లో తరలిస్తున్న 35 ఎద్దులు, 5 ఆవులను వాహనాల తనిఖీలో భాగంగా పట్టుకున్నట్టు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాకు చెందిన డ్రైవర్ లంతూరు విశాల్ (28), నిర్వాహకుడు జార్ఖండ్‌కు చెందిన మహ్మద్ సద్దాంలను అరెస్టు చేశామన్నారు. కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి తీర్థం


స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

రాంబిల్లి : నేవీ పునరావాసకాలనీలో శుక్రవారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, కోలాటాలు, తప్పెటగుళ్లు వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


మూలపేట శ్మశానవాటికలో బోరుకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : మూలపేటలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు కోరారు. మూలపేటలో మరమ్మతుకు గురైన పలు బోర్లను శుక్రవారం ఆయన అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. శ్మశాన వాటికలో బోరును అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు.

మహిళలపై నేరాలు ఆందోళనకరం


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి

యలమంచిలి : సమాజంలో మహిళలపై జరుగుతున్న దాడులు ఆందోళనకరం అని యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా న్యాయ వారోత్సవాల్లో భాగంగా మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం యలమంచిలి కోర్టు సముదాయంలో వెలుగు, వలంటీర్లు, డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యలమంచిలి సీనియర్ సివిల్ జడ్జి ఎ.సాయికుమారి విచ్చేసి మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇటీవల కాలంలో మహిళలపై లైంగిక దాడులు అధికమయ్యాయని అన్నారు. ఇటువంటి అఘాయిత్యాలపై అవగాహన కలిగి, జాగ్రత్తలు పాటించాలని, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్లలో వచ్చే సందేశాల్లో మంచి చెడులపై అవగహన కలిగి ఉండాలని, ప్రతి ఒక్కరూ సమాజంలో ఉన్నతమైన స్థానానికి వెళ్లే ప్రణాళికలు రచించుకోవాలని తెలిపారు. మహిళలకు అన్ని విధాలుగా న్యాయ సహాయం అందించేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీపి డి.వెంకట్రావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తాళ్ల సత్యనారాయణ, న్యాయవాదులు కోట్ని దుర్గాప్రసాద్, కొరెడ్డి అప్పలస్వామినాయుడు, కూనిశెట్టి శ్రీనువాస్, స్వామినాయుడు, ఎల్.వి రామకృష్ణ, నిర్మల, వెలుగు ఏపీఎం రాణి, ఐసీడీఎస్ బేగం పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం


గుడివాడలో ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచారం చేస్తున్న సర్పంచ్ శ్రీనుబాబు


తోటాడలో సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ కరపత్రాల పంపిణీ చేస్తున్న పార్టీ శ్రేణులు

మునగపాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయం కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఈ నెల 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ ఓటర్లను కలుస్తూ ప్రచారం చేస్తున్నారు. తోటాడలో సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్ తదితరులు శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధితో పాటు విశాఖ పరిపాలన రాజధాని కావడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దొరుకుతాయన్నారు. పార్టీ మండల కోశాధికారి మళ్ల ఈశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పలు గ్రామాల్లో సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం విస్తృతంగా ప్రచారం చేశారు. గుడివాడలో సర్పంచ్ దూళి శ్రీనుబాబు, ఉప్పరాపల్లిలో శానాపతి శ్రీరాములు, పెదగుమ్ములూరులో చింతలపూడి మణిరాజు, ఎస్.రాయవరంలో లక్కోజు ఆదిమూర్తి, దోసపాత్రుని సందీప్ ప్రచారం చేశారు.

ఉపమాకలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ఉపమాకలో సీతంరాజుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం చేస్తున్న వీసం

నక్కపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ శుక్రవారం ఉపమాక, సారిపల్లిపాలెం, జానకయ్యపేట, తీనార్ల తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విద్యావంతుడు, సమస్యలపై అవగాహన ఉన్న సుధాకర్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తారన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు సుధాకర్‌కు వేయాలన్నారు.ఈ నెల13వ తేదీన నక్కపల్లిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టభద్రులు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, నాయకులు తాతారావు, బుజ్జి, రవి, సత్తిబాబు పాల్గొన్నారు.

13న విఘ్నేశ్వర ఆలయ వార్షికోత్సవం

మునగపాక : స్థానిక సంతబయిల పురాతన విఘ్నేశ్వర దేవస్థానం వార్షికోత్సవాలను ఈ నెల 13న ఘనంగా నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ మందపాటి శ్రీరామ వెంకట నరసింగరావుశుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

త్వరితగతిన జగనన్న ఇళ్ల నిర్మాణం


విసన్నపేటలో జగనన్న లే అవుట్లను పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి రోజారాణి

కశింకోట : వైఎస్సార్ జగనన్న గృహనిర్మాణ లే–అవుట్లలో స్థలాలు పొంది ఇంకా ప్రారంభించని లబ్ధిదారులు సత్వరమే నిర్మాణాలను చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి రోజారాణి కోరారు. మండలంలోని విసన్నపేట, జమాదులపాలెం గ్రామాల్లోని వైఎస్సార్ జగనన్న లే అవుట్లను అధికారులతో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వచ్చే ఉగాది నాటికి గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లబ్ధిదారులను కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈఈ కె.మధురవాణి, ఏఈ వి.శ్రీనివాసరావు, ఎంపీడీవో కొంకి అప్పారావు, సర్పంచ్‌లు ఉప్పనూరి మాణిక్యం, కరక రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.